


"ఇపుడు మీరు కాఫీ త్రాగుతున్నారా!..."

"ఆ ! నిస్సందేహంగా కాఫీయే తాగుతున్నాను ... టీ కాదనీ, హార్లిక్స్ అసలే కాదనీ ఘంటాపథంగా చెప్పగలను..."

"అఫ్ కోర్స్ ! అది కాఫీయే అనుకోండి ! కాని ఇంకో క్షణం తర్వాత మీరు దాన్ని త్రాగుతూ వుంటారని నమ్మకమేమిటి ?"

"ఖచ్చితంగా త్రాగుతాను. అప నమ్మకం ఏమీ లేదు!"

"అహ ! అది కాదు ! జీవితం క్షణ భంగురంబు అన్నారు కదా..."

"ఎవరన్నారు ? నేనా ?"

"మీరు కాదనుకోండి !..."

"ఆవిడ కూడా అన్నట్టు నాకు జ్ఞాపకం లేదే..."

"మీ ఆవిడగారు కూడా అనకపోవచ్చు. కాని అది జగమెరిగిన సత్యం. ఇంకో క్షణంలో మనం ఏమయిపోతామో చెప్పలేం !"

క్షణంసేపు నిశ్శబ్దం !!

"చూశావా ? క్షణం గడిచిపోయింది. నేను కాఫీ త్రాగుతూనే వున్నాను. నువ్వు గొర్రెలా నావేపు చూస్తూనే వున్నావు. ఇప్పుడేనా ఒప్పుకుంటావా జీవితం క్షణభంగురంకాదని !"

"మీరెన్ని చెప్పండి, రేపు అనేది మన చేతిలో వుందంటే ఒప్పుకోను. ఈ సందర్భంలో మీకో చిన్న కథ చెప్పాలి."

"ఏమిటది ? కొంపదీసి సినీమా కథా ?"

"కాదు ! మన పురాణ కథే ! ఓసారి ధర్మరాజు నిండుసభలో వుండగా ఓ యాచకుడు వచ్చేడట. ధర్మం అడిగితే 'రేపు రా', అన్నాడట ధర్మజుడు. వెంటనే భీముడు అమితోత్సాహంతో ఎగిరిగంతేశాడట ! సైన్యాన్ని పిలిచి పెద్ద ఎత్తున వేడుకలు జరిపించమన్నాడు ! ప్రజలందరినీ పండగ చేసికొమ్మని ఆదేశించేడు ! తమ్ముని ప్రవర్తన ధర్మజునకి అర్థం కాలేదు. భీముణ్ణి పిల్చి 'ఏమిటిదంతా?' అని అడిగేడట. భీముడు అతి వినయంతో అన్నగారికి నమస్కరించి 'మీరు ఆ యాచకుడిని రేపు రమ్మ

న్నారు ! అంటే, రేపటివరకూ మీరు ఖచ్చితంగా బ్రతికి వుంటారని నమ్మకమే కదా ! జీవితం క్షణభంగురం అని తెల్సినా మీరంత ఖచ్చితంగా, నమ్మకంగా చెప్పేరంటే మీ తమ్ముడినయిన నాకు అంతకంటె వేరే ఆనందం ఏమిటుంటుంది ? ప్రజలకు కూడా ఇది చాలా ఆనందదాయకం కాదా ?' అన్నాడుట.

ధర్మరాజు తన తప్పిదం తెల్సుకొని సిగ్గుపడి వెంటనే యాచకుని పిలిపించి అతనికి కావల్సినవి ఇచ్చి పంపేడుట ! అందుకని మనం చేయదల్చుకున్న మంచిపనులు ఏవయినా వుంటే వెంటనే చేసెయ్యాలి !"

"కథ చాలా బాగుందోయ్ ! ఇంతకీ నువ్వు చెప్పదల్చుకున్న విషయం కాస్త వివరంగా చెప్పు !"

"చెప్తాను వినండి ! మీకు ముగ్గురు పిల్లలున్నారా ? ఒక భార్యగారు ఉన్నారా ! అనుకోకుండా మీకు ఏమయినా ప్రమాదం జరిగితే వాళ్ల గతి ఏంకాను ? వాళ్లకు భవిష్యత్తులో భద్రత ఏముంది ? మనం చెడు జరగాలని కోరుకోం ! కాని మనం కోరనంతలో జ ర క్క మా న దు కదా ! ..."

"వెరీ గుడ్! చాలా బాగా చెప్పేవు! అయితే ఈ విషయాన్ని నువ్వు నమ్ముతున్నావా ?"




"ఎంత మాట ! మనసా వాచా నమ్ముతున్నాను కాబట్టే మీకు చెప్పగల్గుతున్నాను.

"నీకు పిల్లలెంతమంది ?"

"ఇద్దరు !"

"భార్యలు ?"

"అఫ్ కోర్స్ ! ఒక్కళ్లే !"

"నీ ఒక భార్యకూ, ఇద్దరి పిల్లల భవిష్యత్తుకూ నువ్వు హామీ ఇవ్వాలా, అక్కరలేదా ?"

"తప్పక ఇవ్వాలి సార్ !"

"ఒకవేళ భవిష్యత్తులో ఇంకా పిల్లలు పుడితే వాళ్లకు కూడా ఇవ్వాలి కదా !..."

"ఇహ ఆ ప్రమాదం లేదులెండి !"

"ఓహో ! ఆపరేషను చేయించావన్నమాట ! వెరీ గుడ్ ! ఈ విషయాన్ని నువ్వింత కూలంకషంగా ఆలోచించి నమ్మేవు కాబట్టి నా పని మరింత సులువయింది ! నా దగ్గర ఓ ఇరవై వేల రూపాయలకు ఇన్స్యూరెన్సు పాలసీ తీసుకో!"

"చంపేరు సార్ ! మీకూ ఏజెన్సీ వుందేమిటి ? నేనూ ఏజెంటునే ! మీ దగ్గర పాలసీ తీసుకుందామని నేను వచ్చేను ... మరి నేను వెళ్ళొస్తాను సార్ !"

"శుభం ! వెళ్ళిరా !"